# 5

# నూతన ఒడంబడిక

*"–ఇదిగో నేను ఇశ్రాయేలువారితోను యూదావారితోను క్రొత్త నిబంధన చేయు దినములు వచ్చుచున్నవి; ఇదే యెహోవా వాక్కు" (యిర్మీయా 31:31).*

*"–ప్రభువు ఇట్లనెను – ఇదిగో యొక కాలము వచ్చుచున్నది. అప్పటిలో ఇశ్రాయేలు ఇంటివారితోను యూదా ఇంటివారితోను నేను క్రొత్తనిబంధన చేయుదును" (హెబ్రీ. 8:8).*

క్రైస్తవులు ఒక దేశములోని అతి శ్రేష్ఠమైన పౌరులైయుందురు (రోమా 13:1). శ్రేష్ఠమైన, నూతనమైన చట్టాలు రూపుదిద్దుకోవాలని వారనుకుంటారు. అవి చేయబడినప్పుడు వాటిని గౌరవిస్తారు. అలాంటి నిర్మాణ కార్యాలలో నిదానమైతే వారు ఓపికతో ఎదురు చూస్తారు, దిద్దుబాటుకు అవసరమైన మార్గాలలో వారు పని చేస్తారు. మార్పు హీనంగా ఉంటే క్రైస్తవుడు శాంతియుతంగా దానిని నిరాకరిస్తాడు. తాను కృతజ్ఞతగల న్యాయబద్ధమైన పౌరునిగా జీవిస్తూ అధిక ప్రయోజనవంతమైన మార్పు తెచ్చేందుకు తన వంతు సహాయం అందిస్తాడు.

అలాగే, మానవుని పట్ల దేవుని వైఖరిలో మార్పులు జరిగినప్పుడు, క్రైస్తవుడు వాటిని సంతోషంతో అంగీకరిస్తాడు. ఆత్మ సంబంధమైన తన ఆర్థిక స్థితికిని, లోకానికిని ఆయన మార్పులు పరిపూర్ణమైనవి మేలైనవియనే జ్ఞాపకం చేసికొంటూ వాటిని స్వీకరిస్తాడు.

ఈ కారణాన్ని బట్టి, దేవుడు మనకొరకు తెచ్చిన క్రొత్త నిబంధనను మనం సంతోషంతో అంగీకరింపవలసినవారమై ఉన్నాం. క్రీస్తు యొక్క మరణ, పునరుత్థానాలతో ఆయన తన ధర్మశాస్త్రాన్ని లేక నిబంధనను మార్చాడు. సువార్త దాని సంపూర్ణ రూపంలో పెంతెకొస్తు దినాన ప్రసంగించబడినప్పుడు ఈ మార్పు ప్రకటింపబడింది.

దేవుడు క్రొత్త నిబంధన తెచ్చే విషయం ఏర్పాటు చేయబడింది, ప్రవచింపబడింది కూడా. మనుష్యునితో తన బాంధవ్యాన్ని అభివృద్ధి గావించడానికి దేవుడు చేసిన ప్రయత్నం ఆషా మాషీ అయినది కాదు. లోక రక్షణకొరకు అది దేవుని దయా పూర్వక సంకల్పమై ఉంది. ఇశ్రాయేలీయులతో పాత నిబంధనను తగిన స్థానంలో నిలిపి సరియైన సమయం

వచ్చేవరకు దానిని పరిశుద్ధమైన ఉద్దేశం కొరకు ఉపయోగించుకున్నాడు. కాలము పరిపూర్ణమైనప్పుడు, తగిన నమూనాను బట్టి క్రొత్త నిబంధన క్రీస్తు రక్తముచే ఆమోదం పొందినదై – దాన్ని తొలగించి వచ్చింది (హెబ్రీ. 8:7, 13).

ఈ క్రొత్త నిబంధన రాకను గూర్చి యిర్మీయా ముందుగా తెలియజేశాడు. ఆశలన్నీ కోల్పోయినట్టు కనిపించిన సమయంలో, ఆశీర్వాద దినమును గూర్చిన దర్శనమును, శ్రేష్ఠమైన నిబంధనను ఆయన తన ప్రజలతో స్థాపించునను నిరీక్షణను ప్రవచనం ద్వారా దేవుడు అనుగ్రహించాడు. విపరీతమైన యూదా పతనాన్ని, ఆరంభమైన బబులోను నిర్బంధాన్ని గ్రహించిన యిర్మీయా, క్రొత్త నిబంధన షరత్తులయందు దేవుడు తన ప్రజలతో ఏర్పాటు చేసికొన్న భవిష్యత్తును గూర్చి వ్రాశాడు:

> ఇదిగో నేను ఇశ్రాయేలువారితోను యూదావారితోను క్రొత్త నిబంధన చేయు దినములు వచ్చుచున్నవి; ఇదే యెహోవా వాక్కు. అది ఐగుప్తులోనుండి వారిని రప్పించుటకై నేను వారిని చెయ్యి పట్టుకొనిన దినమున, వారి పితరులతో నేను చేసిన నిబంధనవంటిది కాదు; నేను వారి పెనిమిటినైనను వారు ఆ నిబంధనను భంగము చేసికొనిరి; యిదే యెహోవా వాక్కు. ఈ దినములైన తరువాత నేను ఇశ్రాయేలు వారితోను యూదావారితోను చేయబోవు నిబంధన యిదే, వారి మనస్సులలో నా ధర్మవిధి ఉంచెదను, వారి హృదయములమీద దాని వ్రాసెదను; యెహోవా వాక్కు ఇదే. నేను వారికి దేవుడనై యుందును వారు నాకు జనులగుదురు; వారు మరి ఎన్నడును – యెహోవానుగూర్చి బోధనొందుడము అని తమ పొరుగువారికిగాని తమ సహోదరులకు గాని ఉపదేశము చేయరు; నేను వారి దోషములను క్షమించి వారి పాపములను ఇక నెన్నడును జ్ఞాపకము చేసికొనను గనుక అల్పులేమి ఘనులేమి అందరును నన్నెరుగుదురు; ఇదే యెహోవా వాక్కు (యిర్మీయా 31:31–34).

యిర్మీయా ప్రవచనాన్ని ఆధారం చేసికొని, హెబ్రీ పత్రికా రచయిత పాత క్రొత్త నిబంధనల మధ్య తారతమ్యాన్ని సూచించాడు. సంఘం హింస నెదుర్కొనే కాలంలో హెబ్రీయులకు పత్రిక వ్రాయబడింది. అప్పుడు బలహీనులైన క్రైస్తవులు క్రైస్తవ్యం పట్ల వారికున్న సమర్పణను విడిచిపెట్టి యూదా మతానికి తిరిగిపోయేలా శోధింపబడు తున్నారు. నిరాశతో, నిస్పృహతో, దిగజారిపోతున్న క్రైస్తవులకు – దేవుడు తన ప్రజలతో స్థాపించిన నూతనమైనదియు మరి శ్రేష్ఠమైనదియునైన ఒడంబడికపట్ల వినూత్నమైన అభినందనను ప్రోత్సహించడానికి రచయిత కృషి చేస్తున్నాడు (హెబ్రీ. 8:8–12).

దేవుడు చేసిన క్రొత్త నిబంధన ఫలితంగా సంఘం ఏర్పడింది. అందువలన, యిర్మీయా యొక్క ప్రవచనపు వర్ణనలో ఉన్న క్రొత్త నిబంధనను తిలకించడంవలన సంఘానికున్న మరొక స్వభావాన్ని మనం చూద్దాం.

## నూతన విశ్వాసం

యిర్మీయా ప్రవచనం ప్రకారం, పాత క్రొత్త నిబంధనలకు మధ్యగల ప్రధాన తారతమ్యం దేవుని సంకల్పంలో హృదయానికి గల స్థానమే. "వారి మనస్సులో నా ధర్మవిధులను ఉంచెదను వారి హృదయములమీద వాటిని వ్రాయుదును ... వారు

నాకు ప్రజలై యుందురు" (హెబ్రీ. 8:10బి). తన నూతన నిబంధనలో, దేవుడు నూతన విశ్వాసాన్ని ప్రతి క్రైస్తవునిలో ప్రేరేపిస్తాడు. సంఘమంటే, దేవుని "నూతన హృదయపు" జనులు.

భౌతిక జన్మవలన ఒకడు పాత నిబంధనలో ప్రవేశిస్తాడు. కుటుంబంలోనికి అవతరించడంవలన ఒకడు ఇశ్రాయేలీయుడౌతాడేగాని, ఆత్మ సంబంధమైన తీర్మానం వలన మాత్రం కాదు. తత్ ఫలితంగా, ప్రతి యూదుల బాలుడు దేవునితో తనకుగల ఆ నిబంధన బాంధవ్యాన్ని బోధింపబడవలసినవాడైయుంటాడు. జన్మయందు యూదుల బాలుడు దేవునితో సహవాస బాంధవ్యంలో ప్రవేశించినా, వాని తల్లిదండ్రులు సరిగా తెలిపేంతవరకు అది అతనికి తెలియదు, లేక వాడు దానిని గ్రహించలేడు. వారేమై యున్నారో పిల్లలకు బోధించడం మాత్రమే గాక, తానెన్నుకున్న దేశ జనముగానున్న ఇశ్రాయేలీయులకు దేవుని పట్ల గల బాధ్యతను, గుర్తింపును సదా నిలపడానికి ఎల్లప్పుడూ ఉపదేశ కార్యక్రమం నిర్వహింపబడుతుండేది.

ఏదియెలాగున్నా, క్రొత్త నిబంధనలోనైతే మాత్రం, క్రొత్త జన్మవలననే ప్రవేశింప వీలు కలుగుతుంది. అంటే, దేవుని చిత్తాన్ని అంగీకరించి, ఆయనయందు విధేయతతో కూడిన విశ్వాసంతో స్పదింపవలసియుంటుంది. దేవుని గూర్చిన జ్ఞానము, మరియు ఆయన రాజ్యంలో ప్రవేశించాలనే వివేచనతో కూడిన నిర్ణయం లేకుండ క్రొత్త జన్మ జరుగనేరదు (యోహాను 6:44, 45). దేవుని రాజ్యములోని ప్రతి ఒక్కరును రక్షణ సందేశాన్ని వినియుంటారు (రోమా 10:17), ఆ సందేశాన్ని తీసికొని అంగీకరించి యుంటారు (అపో. 2:41), ఆ సందేశాన్ని అనుసరించి విశ్వాసంతోను విధేయతతోను లోబడియుండ కోరుకొనియుంటారు (అపో. 2:40).

హృదయం మీద ధర్మ విధులు వ్రాయబడడమనే విషయాన్ని గ్రహించడానికి, కిండర్ గార్డెన్ బడికి వెళ్లే పసివాడి తల్లిని గూర్చి ఆలోచించు. తన బిడ్డ పాఠశాలముందు రద్దీగా ఉన్న రోడ్డుమీద కారు తోలుకుంటూ వెళ్లుతూ ఉండగా, "నిమ్మళించు, పిల్లలు ఆటలాడుతున్నారు" అనే సైన్ బోర్డు ఆమె చూస్తుంది. అప్పుడు ఈ తల్లి ఏమి చేస్తుంది? ఆ గురుతును అలక్ష్యం చేసి వళ్లుతెలియని వేగంతో కారు తోలుతుందా? ఆ గురుతు తనకు కలిగించిన అనానుకూలతను బట్టి ఫిర్యాదు చేస్తుందా? లేదు. ఆ సూచనకు తగినట్టు కారు వేగం తగ్గిస్తుంది. ఆ స్కూలు ఆవరణంలో తన ప్రీతి పాత్రమైన ముద్దుబిడ్డ ఆడుకొంటున్న సంగతి ఆమెకు తెలుసు. తన బిడ్డ వంటి యితర పిల్లల భద్రత కొరకు ఆ చట్టం చేయబడింది. వాస్తవానికి, నెమ్మదిగా నడుపుమని చెప్పవలసిన అవసరమే ఆమెకు లేదు. తన బిడ్డయొక్కయు యితర బిడ్డలయొక్కయు మేలు ఆమె కోరుతుంది. తన బిడ్డ తనకును, యితర బిడ్డలు వారి తల్లిదండ్రులకును అమూల్యమైనవారని ఆమెకు తెలుసు. రాకపోకలు అక్కడ నెమ్మదిగా జరగాలనే ఆ వ్రాతకు ఆమె కృతజ్ఞత కలిగి ఉంటుంది. రాకపోకలను క్రమపరచే అలాటి గురుతు అక్కడ నిలుపకపోయినట్టయితే, అలాటిది పెట్టాలనే కోర్కెతో ఆమె ఒక ఉద్యమాన్ని వెంటనే నడిపియుండవచ్చు కూడా. "నిమ్మళించు, పిల్లలు ఆటలాడుతున్నారు" అనే చట్టం ఆ తల్లి హృదయం బిడ్డ యెడల ఆమెకున్న ప్రేమ, జాగ్రత్తవలన అది వ్రాయబడింది.

దేవుని ధర్మవిధులు క్రైస్తవుల హృదయాలమీద వ్రాయబడ్డాయి. ప్రేమ, విశ్వాసము

వల్ల కలిగిన శక్తి ఆయన చిత్తాన్ని అనుసరించడానికి ప్రేరేపిస్తుంది (1 యోహాను 5:3). ఆయన సందేశం మన హృదయాలలో విశ్వాసము విధేయతను పుట్టిస్తుంది; ఆ సందేశానికి విశ్వాసపు ప్రత్యుత్తరంగా, మనం ఆయన పిల్లలమైయున్నాం. ఆయన వాక్యము మీద పెంపారుతూ మనం మన నూతన హృదయాలను నిలుపుకుంటాం. ఆయన ప్రేమను కృపను ధ్యానించడంతో, ఆయన చిత్తాన్ని జరిగించడానికి మన హృదయాలను తెరచి ఉంచుకొంటూ, ఆయనతో అనుదినం నడుస్తాం.

## నూతన క్షమాపణ

దేవుడు ప్రసాదించు క్షమాపణయందు రెండు నిబంధనల మధ్యగల వ్యత్యాసం కన్పిస్తుంది. తన నూతన నిబంధనలో ప్రవేశించువారిని గూర్చి దేవుడు యిలా సెలవిచ్చాడు, "నేను వారి దోషముల విషయమై దయగలిగి వారి పాపములను ఇకను ఎన్నడును జ్ఞాపకము చేసికొనను ..." (హెబ్రీ. 8:12). క్రొత్త నిబంధన యొక్క ఈ స్వభావాన్ని "నూతన క్షమాపణ" అని పిలువవచ్చు. దేవునినుండి నిజమైన శుద్ధీకరణ పొందే జనుల సంఘమైయుంది.

పాత నిబంధన క్రింద దేవుడు తన ప్రజలైన వారి పాపములకు భావిని నిరీక్షింపదగినట్టి విధానంలో క్షమాపణ దయచేశాడు. గొప్ప ప్రాయశ్చిత్త దినమున ప్రతి సంవత్సరం జంతు బలుల ద్వారా మోషే ధర్మశాస్త్రం పాపమును ముందుకు చుడుతూ పోయేది (లేవీయ. 16). క్రీస్తు వచ్చి పాపము కొరకై ఒక్కసారే మృతి పొందేవరకు మోషే ధర్మశాస్త్రం అవసరమైన దానిని సరిపుచ్చింది (హెబ్రీ. 9:15). క్రీస్తు ప్రభువు వచ్చి సిలువపై మృతిపొంది పాపక్షమాపణ తెచ్చేవరకు నిజమైన ప్రాయశ్చిత్తం (భావి నిరీక్షణయందు తప్ప) వారికి లేదు.

---

**పాత నిబంధన ప్రసాదించే దానికంటెను,**
**క్రొత్త నిబంధనలో దేవునితో మనకు ఉండే బాంధవ్యం**
**ఎక్కువ వ్యక్తిగతమైనది సన్నిహితమైనదియునై ఉన్నది.**

---

ఇప్పుడు, క్రొత్త నిబంధన క్రింద, పాపక్షమాపణ సంపూర్ణంగా లభిస్తుంది. పాపము కొరకైన పరిపూర్ణమైన బలి యేసునందు చేయబడింది. మన గొప్ప ప్రధానయాజకుడుగా, ఆయన పరలోకమందు ప్రవేశించి, మన పాపక్షమాపణ కొరకు మనం వేడుకొన్నప్పుడు, ఆయన మన పక్షమున విజ్ఞాపన చేయువాడై ఉన్నాడు (1 యోహాను 2:1). ప్రస్తుత వాస్తవంగా, క్షమాపణ ప్రసాదించబడింది; భవిష్యత్తులో ఒకనాడు చేయనున్న ప్రాయశ్చిత్త బలి ఉందనే భావనతో అది అనుగ్రహింపబడింది కాదు. అయితే "నమ్మువారు ఆయన కృపచేతనే, క్రీస్తు యేసునందలి విమోచనము ద్వారా ఉచితముగా నీతిమంతులని తీర్చబడుచున్నారు" (రోమా 3:24).

చెల్లింప నశక్యమైన అప్పులో నీవు పడియున్నావనుకో. ఆ అప్పు ఎంతగా పెరిగిందంటే, నీ జీవిత కాలమంతటిలో నీవు చేయగలిగిందంతా కేవలం దాని వడ్డీ కట్టడం మాత్రమే. కాలక్రమాన, మరణిస్తే, ఋణం యిచ్చినవారికి ఇబ్బందిని కలిగిస్తావు. ఎందుకంటే ఆ అప్పులో ఎక్కువ భాగం ఋణపడి ఉంటావు. ఈ ఋణం నీ మేఘాల్లో నుండి సూర్య కాంతిని తొలిగిస్తుంది; తీయ్యని కలగా ఉండడానికి బదులు, జీవితం భరించలేని భయభ్రాంతిగా మారిపోయింది.

అప్పుడు ఒక కోటీశ్వరుడు వచ్చి, "ప్రతి సంవత్సరము నేను వడ్డీ కడతాను. నీకు అప్పు యిచ్చినవారితో మంచి స్థితిని కలిగిస్తుంది. అంతేగాక, నీకు మరణం సంభవిస్తే అసలు చెల్లిస్తాను!" అని అన్నాడనుకో. అది శుభవార్తయే. అయితే నీవు జీవించే మిగిలిన కాలమంతయు ఆ ఋణానికి కట్టుబడవలసి ఉంటుంది. మరణం ఆసన్నమయ్యేవరకు నీవు ఆ ఋణమునుండి విడుదల పొందలేవు.

అయితే యిప్పుడు, నీ ఋణమంతా పూర్ణంగా చెల్లిస్తానని వేరొక కోటీశ్వరుడు ముందుకు వచ్చాడనుకో. అతడు వచ్చి, "నేటినుండి నీవు ఋణములేనివాడవై ఉండునట్లు, నీ ఋణమంతయు సంపూర్ణంగా చెల్లిస్తానని" అన్నాడు! ఇది అన్నింటికంటే శ్రేష్ఠమైన వర్తమానం కాదా? మొదటి ఉపకారి క్షమాపణను ముందు యివ్వబోయాడు. అయితే రెండవ వ్యక్తి క్షమాపణను వాస్తవంగా యిస్తున్నాడు; నేడు అనేదానితో ఆరంభించి, అతడు నూతన జీవితాన్ని ప్రసాదిస్తున్నాడు.

క్రీస్తు శరీరంలో మనము నీతిమంతులముగా తీర్చబడినవారమై నిలిచియున్నాము, గత పాపములన్నిటినుండి మనము కడుగబడినవారమైయున్నాము (రోమా 3:24), మరియు మనవలన జరిగే దైనిక పాపములనుండి కడుగబడుతూ ఉంటాం (1 యోహాను 1:7). క్రొత్త నిబంధన క్షమాపణ ద్వారా, ఋణములేనివారముగా మనం నిరంతరం నిలుపబడుతూ ఉంటాం. ఈ ఆశీర్వాదము ఒక్కటే సంతోషగానంతో మన హృదయాన్ని నిరంతరం నిలుపవలసి ఉంటుంది! మన విమోచకునియొక్క పరిచర్యలో ఎడతెగక నిలిచియుండేలా మన కృతజ్ఞత మనకు బుద్ధిని పుట్టిస్తూ ఉండాలి.

## నూతన సహవాసం

రెండు నిబంధనల మధ్యగల మూడవ తారతమ్యం – నూతన బాంధవ్యం, క్రొత్త నిబంధనలో ప్రవేశించేవారికి దేవునితో నూతన సహవాసము ప్రసాదింపబడుతుంది. "వారిలో ఎవడును **ప్రభువును** తెలిసికొనుడని తన పట్టణస్థునికైనను తన సహోదరు నికైనను ఉపదేశము చేయడు. వారిలో చిన్నలు మొదలుకొని పెద్దలవరకు అందరును నన్ను తెలిసికొందురు" అని దేవుడే తెలియజేశాడు (హెబ్రీ. 8:11).

పాత నిబంధన ప్రసాదించే దానికంటెను, క్రొత్త నిబంధనలో దేవునితో మనకు ఉండే బాంధవ్యం ఎక్కువ వ్యక్తిగతమైనది సన్నిహితమైనదియునై ఉన్నది. సంఘము దేవుని నివాస స్థలమైయున్నది.

క్రొత్త జన్మ మనలను ఆత్మ సంబంధమైన నూతన సహవాసంలోనికి తెస్తుంది.

క్రొత్త నిబంధనలో నిలిచియున్న ప్రతి ఒక్కడు ఆ నిబంధనలోనికి ఆత్మ సంబంధమైన జననంచేత దేవుని కుటుంబంలోనికి ప్రవేశిస్తాడు (యోహాను 3:5). ఆ విధంగా, క్రొత్త నిబంధనలో ప్రవేశించిన ప్రతి ఒక్కరు దేవునితో తండ్రి బిడ్డల బాంధవ్యం కలిగియుంటారు (గలతీ. 4:6, 7). ప్రభువైన యేసు క్రొత్త నిబంధనకు పునాది వేస్తూ ఉండగా, “పరలోకమందున్న మా తండ్రీ” అని తన శిష్యులు ప్రార్థించేలా నేర్పించాడు (మత్తయి 6:9). నిబంధనలన్నిటిలో ఉన్నట్టే క్రొత్త నిబంధనలో కూడా కట్టడలు ఉంటాయి, అయితే దానికి ప్రధానంగా దేవునితో వ్యక్తిగతమైన, సన్నిహితమైన బాంధవ్యం ఉంటుంది.

ఒక స్త్రీ ఒక పుస్తకాన్ని చదివి అది విసుగు చెందించేదిగాను – తన కాలాన్ని వ్యర్థం చేసిందిగాను ఉందని అనుకుంది. తరువాత, ఆ పుస్తకపు రచయితలాంటి పేరున్న ఒకతనిని ఆమె కలిసికొన్నది. మొదట్లో, ఆ పేరు ఒకటే అనే సంగతి ఆమె గుర్తించలేదు; అయితే వారు సన్నిహితులై ప్రేమలోపడగా, చివరికి ఆమె యిలా అంది, “ఒకప్పుడు నీ పేరువంటి పేరుగల రచయిత రాసిన పుస్తకం చదివాను. ఆ రచయితకు నీకు బంధుత్వముందా?” అని ఆమె అతనిని అడిగింది. “అవును, ఆ మనిషిని నేనే, నేనే ఆ పుస్తకాన్ని వ్రాశాను” అని అతడు బదులిచ్చాడు. ఎంత త్వరగా తనకు వీలవుతుందో, అంత త్వరగా ఆమె ఆ పుస్తకాన్ని తిరిగి చదివింది; ఈసారి మునుపెన్నడూ చదువనంత మనోహరంగా ఆ పుస్తకం ఉన్నట్టు కనుగొంది! ఆ పుస్తకం చదివిన ఆ రెండు సార్లకు మధ్యగల వ్యత్యాసమేమి? “బాంధవ్యం” అన్న పదంలో ఆ జవాబు కన్పిస్తుంది. తొలిసారి చదివినప్పుడు, పుస్తకంతోనే సంబంధం ఉంది; రెండవమారు దాన్ని చదివినప్పుడు ఆమెకు రచయితతో సంబంధం కలిగింది. రచయితతో ఆమెకు కలిగిన బాంధవ్యం ఆమె దృష్టిని లేక దృక్పథాన్ని మార్చింది!

పాత నిబంధన ఆ పుస్తకాన్ని తొలిసారి చదివినదాన్ని పోలియుంది. క్రొత్త నిబంధనయైతే రెండవమారు చదివినదాన్ని పోలియుంది. క్రొత్త నిబంధన క్రింద దేవునితో సన్నిహితమైన బాంధవ్యం మనకుంది. ఆయన మన పరలోకపు తండ్రి, మనం ఆయన పిల్లలం (రోమా 8:17). దేవుడును ఆయన కుమారుడును మన దైనిక సహచరులై ఉంటారు (1 యోహాను 1:3). మనం పరిశుద్ధాత్మ సహవాసంచే జీవిస్తాం (1 కొరింథీ. 6:19). మనం దేవునికి ప్రార్థిస్తాం, ఆ వాక్యాన్ని అనుసరిస్తాం, దేవునితోను, ఆయన కుమారునితోను, పరిశుద్ధాత్మతోను మనకున్న బాంధవ్యాన్ని బట్టి కలిగే ఆనందంతోనే ఆయన పనిని చేస్తాం.

## ముగింపు

సంఘము క్రొత్త నిబంధనచే సృజింపబడింది. అలాటప్పుడు, నూతన హృదయాలు, నూతన విశ్వాసం, నూతన క్షమాపణ, నూతన బాంధవ్యం మరియు దేవునితో నూతన సహవాసముగల ప్రజలే సంఘమైయున్నట్టు గ్రహింపనగును. దేవుని కుటుంబంలోనికి ఆత్మ సంబంధంగా జన్మించినవారు, తమ హృదయాల్లో ఆయన ధర్మవిధులు వ్రాయబడిన వారైయుంటారు. “ప్రేమవలన కార్యసాధకమగు” విశ్వాసంతో మనమాయన చిత్తాన్ని

వెదకుతాం (గలతీ. 5:6). వాస్తవమైన పాపక్షమాపణ పొందిన జనులం మనమే, మన పాప ఋణం పూర్ణంగా చెల్లింపబడింది. దేవుడు మన పరలోకపు తండ్రి అయ్యాడు, ప్రభువైన యేసు మనకు పెద్ద అన్నగా ఉన్నాడు, దేవుని ఆత్మ మనలో నివాసం చేస్తాడు (గలతీ. 4:6).

క్రొత్త నిబంధన సార్వత్రికమైన వర్తింపుగలదై ఉంది. ఎందుకంటే ప్రభువు యిలా ఆజ్ఞాపించారు, "–మీరు సర్వలోకమునకు వెళ్లి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును; నమ్మనివానికి శిక్ష విధింపబడును" (మార్కు 16:15, 16). దేవుని రక్షణ సందేశాన్ని విని విశ్వాసంతో విధేయుడైన ప్రతివాడును, ఆయన కుటుంబం లేక సంఘంగా దేవునితోను క్రీస్తు ప్రభువుతోను జీవించునట్లు ఈ క్రొత్త నిబంధనలో ప్రవేశింపవచ్చు. అతడు క్రొత్త నిబంధనలో భాగస్వామియై దానికి సంబంధించిన ఆత్మ సంబంధమైన ఆశీర్వాదములన్నిటిని పొందవచ్చు.

నరుడు చేసే ఒడంబడికలన్నింటి కంటె దేవునితో అతడు చేసికొనే నిబంధన అతి ముఖ్యమైనదన్న సంగతి యిది సూచిస్తుంది. ఒక మనుష్యుడు తన మనస్సును అత్యంత ఘనంగాను ఉన్నతంగాను సద్వినియోగం చేసికొంటాడు. వ్యక్తిగతమైన అంగీకారము, యిష్టపూర్వకమైన కోర్కెవలన నిత్యుడైన దేవునితో ఎన్నటికిని అంతముకాని నిబంధనలో అతడు ప్రవేశిస్తాడు. మనం చేసికొనే నిబంధనలన్నీ తాత్కాలికమైనవే. అంటే ఆ షరత్తులు నెరవేర్చబడేవరకు కొనసాగుతాయి. దేవునితో చేసికొనే ఒడంబడిక జీవితాన్ని మార్పు చేసేదిగాను, నిత్యకాలము ఉండేదిగాను ఉంటుంది.

మన జీవిత కర్తవ్యం దేవుని నిబంధనను గ్రహించడం, క్రొత్త నిబంధనలోనికి రావడం, మన భూ సంబంధమైన యాత్ర ముగిసేవరకు ఆ నిబంధనలో మనం భాగ స్వాములమై ఉండాలి. దేవుని నూతన నిబంధనలో ప్రవేశించుటకు అంగీకరించావా?

## పఠనము మరియు చర్చ కొరకైన ప్రశ్నలు

1. పద్ధతులకు, మోజుకు, క్రైస్తవుని ప్రతిస్పందన ఎలా ఉంటుంది?
2. తాము జీవించే ప్రభుత్వాల పట్ల క్రైస్తవుని యొక్క బాధ్యత ఏమైయుంటుంది?
3. క్రైస్తవునికున్న ద్వంద్వ పౌరత్వమేమి, అతని ప్రాధాన్యతలు ఏమైయుండాలి? ఏ పౌరత్వము ప్రధానమయ్యింది?
4. తన ప్రజలతో దేవుడు తన చట్టాన్ని లేక నిబంధనను మార్చాడా? నీ జవాబును రుజువు చేయడానికి లేఖన భాగాన్ని తెలుపుము.
5. ఇశ్రాయేలుతో దేవుడు చేసిన నిబంధనలో యూదుడు ఎలా ప్రవేశించేవాడు?
6. దేవుడు తన ప్రజలతో చేసిన నిబంధనలో క్రైస్తవుడు నేడు ఎలా ప్రవేశిస్తాడు?
7. నీ హృదయం మీద వ్రాయబడిన చట్టాన్ని గూర్చి వ్యక్తిగతమైన ఉదాహరణనిమ్ము.
8. పాత నిబంధన దినాల్లో దేవుడు పాపక్షమాపణను తన ప్రజలకు ఎలా

ప్రసాదిస్తాడు?

9. పాత నిబంధన కాలంలో దేవుడు ప్రసాదించిన పాపక్షమాపణతో నేడు దేవుడు అనుగ్రహించు పాపక్షమాపణతో పోల్చుము.
10. పాపమునుండి రక్షణ అనే క్రొత్త నిబంధన సందర్భంలో "నీతిమంతులుగా తీర్చబడుట" అనే పదాన్ని వివరించుము.
11. "యెహోవాను తెలిసికొనుడి" అని ఒక్కొక్కనికి నేర్పే ఏర్పాటు పాత నిబంధనలో ఎందుకు అవసరమయ్యింది?
12. క్రొత్త నిబంధనలో దేవునితో క్రైస్తవుని సంబంధాన్ని నీవు ఎలా వర్ణిస్తావు?
13. క్రొత్త నిబంధన సార్వత్రిక వర్తింపు ఉద్దేశింపబడినట్టు చూపే క్రొత్త నిబంధన లేఖన భాగాలను చూపించుము.
14. బహు ఉన్నతమైన మరియు ఘనమైన రీతిలో ఒకడు తన మనస్సును వినియోగించుకొనడమంటే ఏమి?